క్లుప్తంగా

ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు చిత్రనివాళి



ఆకులపై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రం

నారాయణఖేడ్: దేశభక్తికి, దైవభక్తికి మారు పేరు ఛత్రపతి శివాజీమహారాజ్. ఆదివారం ఆయన 391 జయంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెకందిన చిత్రకారుడు గుండు శివకుమార్ రావి, అరటి ఆకులపై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రాలను మలచి నివాళలర్పించారు.

రోడ్డుపై మట్టి పేరుకుపోయి..

కంది(సంగారెడ్డి): జాతీయ రహదారిపై పేరుకుపోయిన మట్టి, ఇసుకతో తరచూ వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కంది మండలంలో నుంచి వెళ్లున్న రహదారిపై పలుచోట్ల కిలోమీటర్ల మేర మట్టి, ఇసుక పేరుకుపోయింది. ఈ దారిలో వాహనాల రాకపోకలతో కళ్లలో దుమ్ము, ధూళి పడి ఇబ్బందులు పడుతున్నారు. ఇసుకున్న చోట వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారులను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలాంటి దుస్థితి నెలకొందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే జాతీయ రహదారిపై పేరుకుపోయిన మట్టి, ఇసుకను తొలగించి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.

పండితుల సస్పెన్షన్ ఉపసంహరించుకోవాలి

నారాయణఖేడ్: ఉన్నత తరగతులకు బోధిస్తున్న పండితులు, పీఈటీలను ఎస్ఏలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసిన వారిని పండుగపూట విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సంగారెడ్డి డీఈవో ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు, ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్‌లు శనివారం మాట్లాడారు. వారి సమస్యలను పరిష్కారానికి సహకరించాలని, సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు ఏషప్ప, నరేష్, నర్సయ్య, ఖేడ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు హరిసింగ్, రాజు పాల్గొన్నారు.


మహాప్రస్థానం పనుల పరిశీలన



మహాప్రస్థానం పనులను పరిశీలిస్తున్న కమిషనరు మల్లారెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్ శివారులో రూ.కోటితో నిర్మిస్తున్న మహాప్రస్థానం పనులను శనివారం అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనరు గోపు మల్లారెడ్డి సందర్శించారు. మహాప్రస్థానంతో పాటు వివిధ ఇతర నిర్మాణపు పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): జెడ్పీటీసీ సభ్యుడు పబ్బ మహేశ్‌గుప్తా జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ప్రణీత్‌రెడ్డి విద్యార్థినులకు సైకిళ్లు అందజేశాడు. గోమారం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10మంది విద్యార్థినులకు మహేశ్‌గుప్తా చేతుల మీదుగా సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్యమాధవారెడ్డి, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శనీశ్వరాలయంలో పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలోని శనీశ్వరాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పురోహితులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాజీపేట రాజేందర్, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పాల్గొని శనీశ్వరుడికి తైలాభిషేకం నిర్వహించారు.



పూజలు చేస్తున్న బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వాల్దాస్ మల్లేశ్‌గౌడ్

కిటకిటలాడిన శివాలయాలు

- మారుమోగిన శివనామస్మరణ
- ఆలయాల్లో ఉపవాస దీక్ష విరమణ

మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మారుమోగాయి. శనివారం తెల్లవారు జాము నుంచే మహాదేవుడికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. సదాశివుడిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.



బీరంగూడ మల్లికార్జు స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు



రాయికోడ్: శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎంపీ బిబి పాటిల్



నారాయణఖేడ్ కాశీనాథ్ ఆలయంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పూజలు



సంగారెడ్డిటౌన్: సంగమేశ్వర స్వామి

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ గుట్టపై కొలువైన మల్లికార్జున స్వామికి భక్తులు రుద్రాభిషేకం చేశారు. అమ్మవారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. రుద్రాభిషేకం తెల్లవారు జామున ప్రారంభించినట్లు అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జి ఈఓ శశిధర్, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు తులసి రెడ్డి మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలో వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం, రథోత్సవం జరుగుతాయన్నారు. డీఎస్పీ భీంరెడ్డి ఆదేశాల మేరకు అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామివారిని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్‌లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నాగేష్, పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఆర్డీఓ నాగేష్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మహిపాల్ రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్ తదితరులు దర్శించుకున్నారు.

భక్తులతో కిటకిట

పటాన్‌చెరు పట్టణంలోని మంజీర క్యాంపస్‌లోని శ్రీ రామలింగేశ్వర ఆలయం, జెపి కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవాలయం, చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుడి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. చైతన్యనగర్ కాలనీలోని శివాలయంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో శనివారం మహాశివరాత్రి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బొంతపల్లిలలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. గ్రామాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి.

రాయికోడ్(అందోల్): మండలంలోని ధర్మాపూర్ శ్రీ లలిత కోటిలింగాల ఆలయంలో జహీరాబాద్ ఎంపీ బిబి పాటిల్ ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా మహా శివలింగానికి అభిషేకం చేశారు. పూజా కార్యక్రమాల్లో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దప్ప పాటిల్, బీఆర్ఎస్ మండల, గ్రామ అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్, హన్మంత్‌రావు పాటిల్, ఆలయ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, నాయకులు, సంగయ్య స్వామి, ఆలయ నిర్వాహకులు ఎస్‌కే పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో మహా శివరాత్రి పూజలు జరిగాయి. భక్తులు దేవతామూర్తులతో పాటు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయాలు పోటెత్తాయి. బుదేరా గుట్టపై కొలువైన శ్రీ భ్రమరాంభ మల్లికార్జున దేవాలయంలో ఆదివారం శివపార్వతులకు కల్యాణం జరుగుతుందని ఆలయ ధర్మకర్త రామమూర్తి తెలిపారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలో మహాశివరాత్రిని ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఉదయం నుంచే భక్తులు శివాలయాల్లో దర్శనానికి బారులు తీరారు. సదాశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. రామలింగేశ్వర ఆలయంలో శివమాల ధరించిన చేసిన స్వాములు స్వామికి పూజలు నిర్వహించారు. రేజింతల్ గ్రామ శివారులోని సిద్ధి వినాయక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శివస్వాములు పాదయాత్రతో ఝరాసంగంలోని కేతకి ఆలయానికి తరలివెళ్లారు.

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని కాశీనాథ్ ఆలయంతోపాటు ఖేడ్ మండలంలోని పంచగామ (పంచవటి)లోని శ్రీనాగలింగేశ్వర, నాగాపూర్‌లో నాగ సంగమేశ్వర, తుర్కాపల్లిలోని శ్రీ సంగమేశ్వర ఆలయాల్లో శనివారం మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. పంచగామ శ్రీనాగేశ్వర ఆలయంలో సహస్ర రుద్రాభిషేకం, రుద్రహోమం, పంచలింగాలకు పూజలు, సామూహిక లింగార్చన, సంగీత కచేరి, భజనలు, కీర్తనలు నిర్వహించారు. ఖేడ్ కాశీనాథ్ ఆలయంలో సామూహిక గణపతిపూజ, రుద్రాభిషేకాలు, నందివాహనసేవ, మహాహారతి నిర్వహించారు. తుర్కాపల్లి సంగమేశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, మహాయజ్ఞం, పల్లకీ సేవ చేశారు. ఆలయాల్లో భక్తులు ఉపవాసదీక్ష విరమించారు. ఖేడ్ కాశీనాథ్ ఆలయాన్ని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు.

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గంలోని అందోలు, పుల్కల్, వట్‌పల్లి, చౌటకూర్ మండలాల్లో మహాశివరాత్రి పండగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. భక్తులు శివరాత్రి ఉపవాసదీక్ష చేపట్టారు. జోగిపేటలోని శ్రీ జోగినాథ ఆలయం, శ్రీ రాజరాజేశ్వర ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

జహీరాబాద్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. శనివారం తెల్లవారు జామునుంచే ఆలయాలకు భక్తులు దర్శనానికి తరలివచ్చారు. శ్రీ కైలాసాగిరి శివాలయంలో స్వామి వారికి ఎమ్మెల్యే మాణిక్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించాన్నారు. ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. స్వామి వారి కృపతో ప్రజలు సుఖ శాంతులతో ఉండాలన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ తరపున అల్లాడి వీరేశం సన్మానించారు. అనంతరం పురాతన సోమేశ్వర ఆలయం, సిద్దేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాల్లో ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు మాంకల్ సుభాశ్, అల్లాడి నర్సింహులు, మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు నామ రవికిరణ్, రాములు నేత, బీఆర్ఎస్ నాయకులు, వైద్యనాథ్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ, వేణు, తిర్మల్, పాండు, పవన్, విక్రం, నాగరాజ్ పాల్గొన్నారు.



జోగిపేట(అందోల్): జోగినాథ ఆలయంలో ..



మునిపల్లి(అందోల్): భ్రమరాంభ మల్లికార్జున స్వామి



పటాన్‌చెరు టౌన్: భ్రమరాంభ మల్లికార్జున స్వామి



పటాన్‌చెరుటౌన్: పూజా కార్యక్రమాలను తిలకిస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని దత్తగిరి కాలనీలో గల బసవ మండపంలో శనివారం రాత్రి సామూహిక ఇష్టలింగ పూజలు నిర్వహించారు. పట్టణంలోని బసవ భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి పూజలో పాల్గొన్నారు. సృష్టికర్త పరమాత్ముడిని స్మరించుకున్నారు. అనంతరం పండ్లను తీసుకుని ఉపవాస దీక్ష విరమించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్, అక్కన బళగ సభ్యులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం తెల్లవారు జాము నుంచే భక్తుల రాకతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు శివాలయాల్లో శివలింగినికి అభిషేకం, బిల్వార్చన చేశారు. ఉపవాస దీక్ష తీసుకున్న వారు సాయంత్రం విరమించారు. పట్టణంలో శ్రీఈశ్వర్ మార్కండేయ, శంభులింగేశ్వర, ఎడ్లబజార్లోని బసవేశ్వర, చెన్నై బసవేశ్వర, మహాలింగం, శ్రీ సంగమేశ్వర మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంగమేశ్వర మందిరంలో శ్రీమతి భాగ్యరేఖ కూచిపూడి నృత్యాలు, శ్రీమతి కవిత రవీంద్రనాథ్ రామదాసు పాట కచేరి జరిగాయి. పాండురంగారావు రామదాసు ఆధ్వర్యంలో బీదర్ వాస్తవ్యుడు దత్తు మహారాజు వారిచే శివపార్వతుల కల్యాణ కథ వివరించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కౌన్సిలర్ ఆకుల శివకుమార్, మంజుల, బుగ్గారం శ్రీనివాస్, రాజేశ్వరి దంపతులు చేశారు. మారేపల్లి వెంకటేశం గౌడ్ భక్తులకు లడ్డూ ప్రసాద వితరణ చేశారు.

సంగారెడ్డిటౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు సదాశివుడికి అభిషేకం, బిల్వార్చన చేశారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించారు. పట్టణంలో కేతకి సంగమేశ్వర ఆలయంలో భక్తులు పూజలు చేశారు.



కైలాసగిరి శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్ రావు



సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేటలోని సంగమేశ్వర మందిరంలో..



మల్లి గ్రామ శివారులోగల శ్రీ నవనాథ్ సిద్ధిలింగేశ్వర ఆలయంలో..

రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ బలోపేతమయ్యేందుకు 11 వేల కేంద్రాలలో యుద్ధ ప్రతిపాదికన కార్నర్ సమావేశాలు నిర్వహిస్తున్నాయని, ప్రజాగోస–బీజేపీ భరోసా పేరుతో ఈ సమావేశాలు కొనసాగిస్తామని రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్, పటాన్‌చెరు నియోజక వర్గ ప్రజాగోస, బీజేపీ భరోసా కోఆర్డినేటర్ గోదావరి అన్నారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్‌లో గల 86,87,88,89 బూత్‌లలో కౌన్సిలర్ సాయికిరణ్ రెడ్డి, నాయకుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్నర్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రజలకు మోడీ ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీకాంత్‌యాదవ్, సీనియర్ నాయకులు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి, రాఘవేంద్రరెడ్డి, రవి, రాజు ఉదయ్‌కిరణ్, మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులు మేఘనరెడ్డి, సరస్వతి, స్రవంతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బొల్లారం కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న గోదావరి

కనుల పండువగా ఊరేగింపు

పటాన్‌చెరు టౌన్: మహాశివరాత్రి సందర్భంగా పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో ఎస్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో శనివారం జాగరణ మహోత్సవం కనులపండువగా సాగింది. శివ, పార్వతుల విగ్రహాలను ఇస్నాపూర్ చౌరస్తా నుంచి చిట్కుల్ మల్లన్న ఆలయం వరకూ ఊరేగించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపులో కేరళ బ్యాండ్, మంగళ వాయిద్యాలు, కళాకారుల వేషధారణ ఆకట్టుకుంది.



ఊరేగింపులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు

సంక్షిప్త వార్తలు

◆ **వెంకటాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భక్తుల గోవింద నామస్మరణ, అన్నమయ్య సంకీర్తనల నడుమ మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులోగల వెంకటాచల దివ్య క్షేత్రంలో కొలువైన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని పలుగ్రామాల, సదాశివపేట పట్టణ ప్రజలు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ **రోగులకు పండ్ల పంపిణీ**

పటాన్‌చెరు టౌన్: అఖిల భారత ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు, మాజీ మంత్రి సంజీవ రెడ్డి 93వ జన్మదినం పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఐఎన్‌టియూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల కొరకు రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక వ్యక్తి సంజీవ రెడ్డి అన్నారు. కార్మికుల హక్కులను పోరాటాల ద్వారా కాపాడుకుంటామన్నారు.

◆ **నేడు ఛత్రపతి శివాజీ బైక్‌ర్యాలీ**

పటాన్‌చెరుటౌన్: ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ పంచముఖి హనుమాన్ దేవాలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించనున్నట్లు పటాన్‌చెరు ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు రాజు గోపాల్ యాదవ్ శుక్రవారం తెలిపారు. 19వ తేదీ ఉదయం 10 గంటలకు పంచముఖి హనుమాన్ దేవాలయం నుంచి మహంకాళి దేవస్థానం వరకు కొనసాగుతుందన్నారు. మహంకాళి దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ **హైమాస్ట్ లైట్ల ప్రారంభం**

రాయికోడ్(అందోల్): మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. వాటిని శనివారం ఎంపీ బిబి పాటిల్ ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో లైట్లు లేకపోవడంతో రాత్రి వేళ ఇబ్బందిపడుతున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు, స్థానిక నాయకుడు సంగయ్య స్వామి ఎంపీ దృష్టికి తీసుకు వెళ్లారు. ఎంపీ ఫండ్స్ నుంచి నిధులు మంజూరు చేశారు.



◆ **పార్టీ బలోపేతానికి కృషి**



జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్‌పార్టీ జిన్నారం మండల అధ్యక్షులు వడ్డె కృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని కొడకంచి గ్రామంలో ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో పార్టీ మండల బాధ్యతలు అప్పగించేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. గ్రామాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

◆ **కోవిడ్ టెస్ట్‌లు**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఐదుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందరికి నెగిటివ్ వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదన్నారు.

◆ **‘చింతా’ కోలుకోవాలని ప్రత్యేక పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఇటీవల అనారోగ్యానికి గురైన రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ త్వరగా కోలుకోవాలని పార్టీ నాయకులు, అభిమానులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శనివారం మండల పరిధిలోని కంబాలపల్లి వెంకటేశ్వర ఆలయంలో బీఆర్ఎస్ మండల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జన్న, సత్యనారాయణ, పబ్బతి లక్ష్మారెడ్డి, ఎంపీపీ తొంట యాదమ్మ కిష్టయ్య, సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, నవీన్, కుమార్, శ్రీహరి, ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, సునీత సుధాకర్, అల్లం లలిత, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆరీపొద్దీన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

